సదస్సు.. తుస్సు..!


చేకూరపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

- గ్రామాల్లో మొక్కుబడిగా రెవెన్యూ రీ సర్వే సదస్సులు
- అర్జీలు స్వీకరించడం మినహా పరిష్కారం శూన్యం

నాగులుప్పలపాడు: జిల్లా వ్యాప్తంగా భూముల రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోంది. ఆ మేరకు ఈ నెల 1న తహసీల్దార్ కార్యాలయాలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ఈ సదస్సులు గత ప్రభుత్వంపై రైతాంగంలో వ్యతిరేకతను తీసుకురావడానికేనన్న తీరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఉత్తుత్తి సదస్సులు నిర్వహిస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల పునరుద్ధరణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టింది. కేంద్రంలో నాడు, నేడు అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో భూముల రీ సర్వేను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టింది. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ దీన్ని బూచిగా చూపింది. రైతుల భూముల్లో ఏదో జరిగిపోతోందంటూ ఎన్నికల ముందు హడావిడి చేసింది. తద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నించింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఉద్దేశపూర్వకంగా రైతుల సమస్యలను పరిష్కరించకుండా తొక్కిపెడుతోంది. గత ప్రభుత్వానిదే ఈ పాపం అని రైతుల్లో వైఎస్సార్ సీపీపై అసంతృప్తి పెంచేందుకు కుట్రలు పన్నుతోంది. అందుకోసమే తహతహలాడుతున్న నేపథ్యంలో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.

గతంలో ఏం జరిగింది..?

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా, భూములను రీ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. తద్వారా గ్రామాల్లో చాలా వరకు రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఏవైనా సమస్యలుంటే నేరుగా రైతులే ఫిర్యాదు చేస్తే సవరణలకు నాటి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కానీ, టీడీపీ మాత్రం ఎన్నికల ముందు దీనిపై అక్రమాలంటూ హడావిడి చేసింది. రీ సర్వే వద్దంటూ ఫిర్యాదులు చేయించింది. దీంతో ఎన్నికల ముందు ఈసీకి ఫిర్యాదులు చేసి రీ సర్వేను హోల్డ్‌లో పెట్టించింది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత మూడు నెలలు రీ సర్వే హోల్డ్‌లో ఉంది. ప్రస్తుతం అధికారం మారింది. వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోకుండా మరో మూడు నెలల తర్వాతే నిర్ణయం అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇప్పుడు రీ సర్వే రద్దు చేసిందా..? అంటే అదీ లేదు. ఇది మంచిదేనని చెబుతూ కొనసాగించింది. ఇప్పటికైనా కరెక్షన్‌కు అవకాశం ఇచ్చిందా..? అంటే అదీ లేదు. కేవలం ఆయా గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ఫిర్యాదులు మాత్రమే సేకరిస్తోంది. ఈ అర్జీలను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామంటూ అధికారులతో రైతులకు ప్రభుత్వం అబద్ధాలు చెప్పిస్తోంది. కేవలం ఫిర్యాదులు మాత్రమే స్వీకరిస్తూ రైతుల సహనాన్ని మరింత పరీక్షిస్తోంది.

వెబ్‌ల్యాండ్ ఇవ్వరేమి...

భూముల్లో సవరణలకు ప్రధానంగా వెబ్‌ల్యాండ్ విడుదల చేయాలి. దీని ద్వారా సవరణలకు అవకాశం ఉంటుంది. ఇది విడుదల చేస్తేనే రైతులు భూములను సైతం రిజిస్ట్రేషన్ చేసుకోవడం, బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకోవడం చేస్తారు. అయితే సదస్సులు నిర్వహిస్తున్న ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ విడుదల చేయకపోవడంతో ఈ సదస్సులు ఉత్తుత్తి సదస్సులే అని స్పష్టమవుతోంది. అధికారులు మొక్కుబడిగా గ్రామాలకు వెళుతూ సదస్సులు నిర్వహిస్తుండగా, రైతులు ఇప్పటికైనా సమస్యలు పరిష్కరిస్తారేమోనని దింపుడుకల్లం ఆశతో ఎదురు చూస్తున్నారు.

వర్షం నీరు తరలించేందుకు చర్యలు

- జ్వరపీడితులకు వైద్య పరీక్షలు
- నీటి నిల్వల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేసిన వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..


నీటిలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వేస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాగర్, వైద్య సిబ్బంది

కొత్తపట్నం: ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తపట్నంలోని పలు కాలనీలు, కె.పల్లెపాలెం తదితర ప్రాంతాల్లో పది రోజులకుపైగా నీరు నిల్వ ఉంది. ఇళ్ల చుట్టూ, రోడ్లపై నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానిక ప్రజలు వ్యాధుల బారిన పడ్డారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'జలం..జ్వరం..దుర్గంధం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి అధికారులు స్పందించారు. వైద్య సిబ్బంది రంగంలోకి దిగి జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేశారు. ఇళ్ల చుట్టూ నిల్వ ఉన్న వర్షం నీటిని బయటకు పంపేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా నిల్వ ఉన్న నీటిలో బ్లీచింగ్, సున్నం, ఆయిల్ బాల్స్ వేశారు. దోమలు ఉత్పత్తి కాకుండా ఇళ్ల వద్ద ఉన్న తొట్లు, ఖాళీ కొబ్బరిబోండాలు, ఇతర సామగ్రిని శుభ్రం చేశారు. ఒంగోలు నుంచి వచ్చిన మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాగర్ కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి స్థానిక వరద బాధిత ప్రాంతాలను పరిశీలించారు. ఫీవర్, టైఫాయిడ్ సర్వే చేయించారు. రెండు ఫీవర్ కేసులు రావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ఆర్‌డీటీ, రక్త పరీక్షలు చేయించారు. వారికి అవసరమైన చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది బీసీ హాస్టల్ ఆవరణలో నిల్వ ఉన్న నీటిని, కె.పల్లెపాలెం ప్రాంతాన్ని, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న నీటిని పరిశీలించి ఆయిల్ బాల్స్ వేసి ఎంఎల్‌వో ఆయిల్ చల్లించారు. తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ జ్వరపీడితులను పర్యవేక్షించి జ్వరం పూర్తిగా తగ్గేంత వరకూ వైద్య పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. తమ సమస్యలపై కథనం ప్రచురించి అధికారులు, సిబ్బంది స్పందించేందుకు కారణమైన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ యామిని, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి బాధిత మహిళ


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత మహిళ

ఒంగోలు టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండులో గురువారం దాడికి గురైన మతిస్థిమితం లేని మహిళను శుక్రవారం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి వైద్యం అందించారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండులో దాసరి నాగరాజు అనే వ్యక్తి చేతిలో మహిళ దెబ్బలు తిన్న విషయం తెలుసుకుని ఆమె కుటుంబ సభ్యులు ఒంగోలు వచ్చారు. బస్టాండులో గాయాలతో పడి ఉన్న ఆమెను చూసి కన్నీరు పెట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన అద్దంకి మెర్సీకి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వాళ్లిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. భర్తతో కలిసి మెర్సీ ఉంటోంది. తరచూ ఒంగోలులో ఉంటున్న పెద్ద కూతురు నాగమణి వద్దకు వచ్చివెళ్తుంటుంది. ఒక టిన్నరేళ్లుగా ఆమె ఆరోగ్యం దెబ్బతింది. మానసిక పరిస్థితి బాగాలేదు. నాలుగు రోజులుగా సమస్య ఎక్కువైంది. ఈ క్రమంలోనే మెర్సీ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భవాని మాల వేసుకుని ఆర్టీసీ బస్టాండు సమీపంలో తిరుగుతోంది. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పుకుంటోంది. మానసిక స్థితి బాగాలేని అలాంటి మహిళపై దాడికి దిగిన నాగరాజును కఠినంగా శిక్షించాలని బాధితురాలి బంధువులు పోలీసులను కోరారు.

28న జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా కాంగ్రెస్ నాయకులతో ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల ఈ నెల 28వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో జరిగే ఈ సమావేశానికి ఏపీ ఇన్‌చార్జ్ పాలక్ వర్మ హాజరవుతారని, జిల్లాలోని నియోజక వర్గ ఇన్‌చార్జులు, ఇతర నాయకులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సంతనూతలపాడు: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు మండలం మైనంపాడు హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంతనూతలపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

తప్పిపోయిన చిన్నారులు తల్లిదండ్రులకు అప్పగింత


తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: తప్పిపోయిన చిన్నారులను వెంటనే పట్టుకున్న పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండ మండలంలో చదువుకుంటున్న ముగ్గురు బాలికలు, ఒక బాలుడు ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది ఇళ్లు వదిలి వెళ్లిపోవడం కలకలం సృష్టించింది. ఈ నెల 23వ తేదీ స్కూలుకు వెళ్తున్నట్లు చెప్పి వచ్చిన నలుగురు చిన్నారులు నేరుగా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నెల్లూరు, అక్కడి నుంచి తెనాలి, గుంటూరు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన వారి తల్లిదండ్రులు పిల్లల కోసం చుట్టుపక్కల వెతికారు. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పిల్లలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు వారిని పట్టుకున్నారు. తప్పిపోయిన పిల్లలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐ మహేంద్ర, ఏఎస్ఐలు మహబూబ్ బేగ్, మహబూబ్ బాషా, కానిస్టేబుల్ శివకుమారి, అనూషలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఫ్యాక్టరీని సందర్శించిన ఏకేయూ విద్యార్థులు


ఫ్యాక్టరీలో ఉన్న ఆక్వాకల్చర్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: క్షేత్రపర్యటనలో భాగంగా ఆంధ్రకేసరి యునివర్శిటీ కళాశాలలోని ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ డిపార్టుమెంట్ విద్యార్థులు శుక్రవారం సింగరాయకొండ సమీపంలోని దేవీ సీ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీని సందర్శించారు. విద్యార్థులను అధ్యాపకులు బి.సురేష్, డాక్టరు అశ్వర్థనారాయణ తదితరులు గైడ్ చేశారు. సదరు ఫ్యాక్టరీలోని శీతలీకరణ యంత్రాలను, రొయ్యలు నిల్వచేసే విధానాన్ని, రొయ్యలు గ్రేడింగ్ చేసే విధానాన్ని, రొయ్యలు ప్యాకింగ్ చేసే విధానాన్ని, తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. రొయ్యలు నిల్వ చేసేందుకు ఏ స్థాయిలో శీతలీకరణ సామర్థ్యాన్ని వినియోగించాలి, శీతలీకరణ యంత్రాలను వినియోగించే సమయంలో సిబ్బంది ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, శీతలీకరణ యంత్రాల పరిమాణం, సామర్థ్యం, తదితర అంశాలను కూడా ఫ్యాక్టరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా ఎస్‌జీఎఫ్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అథ్లెటిక్స్ పోటీలను శుక్రవారం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హజీరాబేగం మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీపడాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అన్ని విభాగాల్లో పరుగుపందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు టి.సుబ్బారావు, చిరంజీవిరెడ్డి, జి.మాల్యాద్రి, కె.జీవన్‌కుమార్, ఐజాక్, కిరణ్ కుమార్, వై.సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యునిగా ఎంపీ మాగుంట

ఒంగోలు సబర్బన్: కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యునిగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎన్నికయ్యారు. ఆ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ శుక్రవారం సంప్రదింపుల కమిటీ జాబితా విడుదల చేసింది. ఇప్పటికే మాగుంట పార్లమెంట్ గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

260 మందికి అన్నదానం

సంతనూతలపాడు: సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో సేవా సంకల్ప్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో ఒంగోలుకు చెందిన సీహెచ్ వీరాంజనేయులు కుమార్తె లిఖిత జన్మదినం సందర్భంగా శుక్రవారం 260 మందికిపైగా పేదలకు అన్నదానం చేశారు. సేవా సంకల్ప్ ట్రస్టు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణ స్వామి, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, శీలం మల్లారెడ్డి, వేమా కవిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీహెచ్‌పీ సత్సంగవర్గ

ఒంగోలు మెట్రో: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దక్షిణాది ప్రాంత సత్సంగవర్గ కార్యక్రమాన్ని మల్లవరం వాసవీ సత్రంలో శని, ఆదివారాలు నిర్వహించనున్నట్లు ప్రాంత సత్సంగ్ ప్రముఖు సోమ సుబ్బారావు తెలిపారు. సత్సంగం ద్వారా ప్రతిఒక్కరినీ జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది వారిలో నిగూఢమై ఉన్న ఆధ్యాత్మిక భావనలను, దేశభక్తిని రగిలించనున్నట్లు తెలిపారు. ప్రతి ఊరి నుంచి దేవాలయాల అనుబంధంగా ఇద్దరు లేక ముగ్గురు సత్సంగవర్గలో పాల్గొని విశ్వహిందూ పరిషత్ కేంద్ర ప్రాంత ప్రముఖులు తెలిపే జ్ఞాన సంపదను అందుకోవాలని కోరారు. దక్షిణాంధ్ర ప్రాంతంలోని 16 జిల్లాల నుంచి విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు సత్సంగవర్గలో పాల్గొంటారని తెలిపారు.

రేపు శ్రీగిరిలో సుదర్శన హోమం


వెంకటేశ్వరస్వామికి మేల్‌చాట్ వస్త్రాలు సమర్పిస్తున్న హరిప్రియ

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పరాంకుశం సీతా రామాచార్యుల బృందం ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. అదేరోజు శ్రీవారికి సువర్ణ అష్టాదళ పద్మ పాదార్చన కార్యక్రమం జరుగుతుందన్నారు. సుదర్శనహోమంలో పాల్గొనదలచిన భక్తులు 7981688677 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వెంకటరమణారావు 71వ జయంతి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ...

ఒంగోలుకు చెందిన దాసరి హరిప్రియ అనే భక్తురాలు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి మేల్‌చాట్ వస్త్రాలు సమర్పించారు. ఆమెకు ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

రాజేశ్వరరావుకు ఘన నివాళులు


రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: సరళమైన పదాలతో మధుర భావనలతో గొప్ప కవిత్వం రాసిన పద్య కవి డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు అని పలువురు వక్తలు కొనియాడారు. రాజేశ్వరరావు ఆరో వర్ధంతిని ఒంగోలు శ్రీనగర్ కాలనీలోని జానుడి సాహిత్య కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు జానుడి డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. జాన్ సామ్యూల్, సాల్మన్, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దారా మోహన్, కోశాధికారి ఏ బ్రహ్మయ్య, కసుకుర్తి చిరంజీవి, సాయి రాజేష్, తెలుగు అధ్యాపకుడు మహేశ్వరాచారి, న్యాయవాది అట్లూరి రాఘవులు, ఆడే రామ సుబ్బారావు, పలువురు సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు


పాదర్తిలో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

పాదర్తి (కొత్తపట్నం): గతంలో జరిగిన భూముల రీ సర్వేలో సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు ప్రస్తుతం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పిన్నింటి మధుసూదన్‌రావు తెలిపారు. పాదర్తి రెవెన్యూ పరిధిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ కట్టా సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూముల కొలతల్లో హెచ్చుతగ్గులు, సర్వే నంబర్లలో మార్పులు, పేర్ల మార్పు, మొదలగు సమస్యలన్నీ పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభకు మొత్తం 112 అర్జీలు వచ్చాయి. ఎల్‌పీఎం సమస్యపై 38 అర్జీలు, జాయింట్ ఎల్‌పీఎం 40, ఆన్‌లైన్‌కు 21, భూమి హెచ్చుతగ్గులకు సంబంధించి 10, భూమి సరిచేయుటకు 3 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్, ఆర్ఐ వరప్రసాద్, సర్వేయర్ సుధీర్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్షయ పాత్ర ద్వారా ఆహార సరఫరా వద్దు

ఒంగోలు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలకు అక్షయ పాత్ర ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 747 గిరిజన పాఠశాలల వసతి గృహాల్లో 1.82 లక్షల మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. వీరందరికీ నాణ్యమైన భోజనం అందించడంలో తరచూ ఏర్పడుతున్న ఇబ్బందులను సాకుగా చూపించి వారికి అక్షయపాత్ర ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. హాస్టళ్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేయడానికే ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నారని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు విడుదల చేయకపోవడం వలనే హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఈ విషయాలను కప్పిపుచ్చి అక్షయపాత్ర ఏజెన్సీ ద్వారా ఆహారం సరఫరా చేయాలనుకోవడం వెనుక మతలబు ఏమిటో తెలపాలని కోరారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పొగాకు పంట నియంత్రణపై అవగాహన సదస్సు

మద్దిపాడు: పొగాకు పంట నియంత్రణపై మండలంలోని కొలచనకోట గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి కె.రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పొగాకు పంటను పొగాకు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పండించాలని సూచించారు. గత మూడు సంవత్సరాలుగా ఇతర దేశాలలో పొగాకు లేనందు వలన మనకు అత్యధిక ధరలు లభించాయన్నారు. బోర్డు కూడా ఎటువంటి పెనాల్టీ లేకుండా పొగాకు అమ్ముకోవడానికి అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఈ సంవత్సరం ఇతర దేశాలు కూడా పొగాకు పంట వేశాయని, అందువలన రైతులు పంటను అనుమతించిన మేరకే పండించాలని తెలిపారు. పంట అధికంగా పండిస్తే పెనాల్టీలు పెంచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. మేలిమిరకం పొగాకు పండించడానికి పలు సూచనలు చేశారు. లోతట్టు, చవిటి నేలల్లో పొగాకు పంట వేయరాదని సూచించారు. పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటలైన మిరప, శనగ, కంది పంటలు వేసుకోవాలని రైతులను కోరారు. పొగాకు నాణ్యతకు ఎస్ఓపీ ఎరువు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ఎస్‌హెచ్ మేనేజర్ రామాంజనేయులు, శ్రీహర్ష, ఐటీసీ, జీపీఐ కంపెనీల ప్రతినిధులు వరహాల చౌదరి, శేషగిరి, మహేష్, పలువురు పొగాకు రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభకు 90 అర్జీలు

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు రైతుల నుంచి భారీగా 90 అర్జీలు వచ్చాయి. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు జరిగితే అర్జీలు దాఖలు చేసుకోవచ్చని, వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. భూముల విస్తీర్ణంలో వ్యత్యాసం, ఎల్‌పీఎం సబ్ డివిజన్, కొత్త పాస్ పుస్తకాల కోసం అధిక సంఖ్యలో అర్జీలు దాఖలైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, గుమ్మలంపాడు సర్పంచ్ షేక్ పాత్యా సాహెబ్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మాబు సుభాని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్ తేజ, మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ సోలార్ కనెక్షన్లకు సబ్సిడీ

- బ్యాంకు రుణ సౌకర్యం కూడా..
- జిల్లాలో పథకం అమలుకు 71 బృందాల ఏర్పాటు
- ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు


కట్టా వెంకటేశ్వర్లు, ఎస్ఈ

ఒంగోలు సబర్బన్: పీఎం సూర్య ఘర్ కార్యక్రమంలో భాగంగా సౌర విద్యుత్ పథకం కింద విద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు సబ్సిడీతో పాటు బ్యాంకు రుణ సౌకర్యం అందిస్తామని ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ శాఖ డీఈలు, వెండర్స్‌తో సోలార్ ఎనర్జీ వినియోగంపై వినియోగదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఇంటిని సూర్య ఘర్ పథకంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని 71 సెక్షన్లలో 71 మంది సెక్షన్ ఆఫీసర్లు 150 మంది ఇతర సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ప్రతీ ఇంటికి వెళ్లి వినియోగదారులను చైతన్య పరుస్తారన్నారు. కిలోవాట్ పవర్ కోరుకునే వారికి రూ.30 వేలు, రెండు కిలోవాట్ పవర్ కోరుకునే వారికి రూ.60 వేలు, మూడు కిలోవాట్లు విద్యుత్ కావాలనుకునే వారికి రూ.78 వేలు సబ్సిడీ ఇస్తారన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలోకి వచ్చిన వారి మిగులు విద్యుత్‌ను విద్యుత్ శాఖ కొనుగోలు చేసి ఆ మొత్తాన్ని బ్యాంకు అకౌంట్‌కు ఆ సొమ్మును జమ చేస్తారన్నారు. సోలార్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారునికి ప్రస్తుతం ఉన్న ఎనర్జీ మీటర్ స్థానంలో బైడైవర్షన్ మీటరును పెడతారన్నారు. లక్ష రూపాయలకు రూ.80 వేలు బ్యాంకు రుణం ఇస్తుందని, మిగిలిన రూ.20 వేలు కట్టిన వెంటనే కనెక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఈఈలు అబ్దుల్ కరీం, హరిబాబు, శ్రీనివాసులు, వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత


సరుకులు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: కల్వకుంట్ల చంద్రసేన గుప్తా 23వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వీఐపీ రోడ్డులోని విశ్వసేవిక వృద్ధాశ్రమానికి శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బదరీనారాయణ, వాసవీ క్లబ్ 205 జిల్లా అధికారులు పబ్బిశెట్టి వినోద్ కుమార్, దర్శి మనోహర్ చంద్రశేఖర్, పబ్బిశెట్టి గోవర్ధన్, చీదెళ్ల వెంకట ప్రసాద్, నేరెళ్ల శ్రీనివాసరావు, భూమా శ్రీనివాసరావు, సుంకు రఘు, తదితరులు పాల్గొన్నారు.